# కొత్త మలుపు

**- బడబాగ్ని శంకరరాజు**



**రఘుతో తనకు వివాహమైనప్పుడు జీవితం ఒక తియ్యటి కలలా సాగుతుందని అనుకుంది రెడ్డెమ్మ.**

నాలుగేళ్ళ మధురమైన వివాహ జీవితంలో ఇద్దరు ఆణిముత్యాల్లాంటి పిల్లలు కలిగారు.

కల నిజమవుతున్నట్లనిపించింది రెడ్డెమ్మకు. జీవితంలోని ఆటుపోట్లు తెలియని రెడ్డెమ్మ అంతకంటే భిన్నమైన జీవితాన్ని అప్పుడు ఊహించలేదు. మృత్యువు తన కళ్ళ ముందే డ్యూటీలో వున్న తన భర్త ప్రాణాన్ని ఆక్సిడెంట్ రూపంలో కబళించి వేసింది. తను గాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది. భర్త ఆర్.టి.సి. బస్ డ్రైవర్‌గా, తను కండక్టర్‌గా ఒకరికి ఒకరుతోడుగా వుంటూ, ఉద్యోగ బాధ్యతల్ని, జీవితాన్ని సాఫీగా నడిపారు.

అది గతం -

ఇప్పుడు అన్ని పనులూ తనే ఒంటరిగా నిర్వహించాలి. జీవితమిప్పుడు అగమ్యగోచరంగా అనిపిస్తోంది.

"వాడు తోడున్నంతకాలం పదిమందిలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉద్యోగం నెట్టుకొస్తివి. అంతటి రక్షణ నీకిప్పుడు లేకపోయినా, సాంప్రదాయానికి విరుద్ధమయినా సరే, తాళిబొట్టు మాత్రం తీసివేయకుండా మెడలోనే వుంచుకో. అదే నీకు ఈ సమాజంలో కొంతైనా రక్షణ కల్పిస్తుందమ్మా" అన్న అత్తగారి మాటలు తనకు కొండంత ధైర్యాన్ని కలుగచేశాయి.

నేను తొలుత ఉద్యోగంలో చేరేటప్పుడు ఆడదానికి ఉద్యోగమెందుకు? అని అడ్డుతగిలిన అత్తమ్మ ఇప్పుడు సామాజిక కట్టుబాట్లను కూడా లెక్కచెయ్యకుండా నాకు ఉద్యోగ నిర్వహణలో భద్రత, రక్షణ కల్పించడానికి తాపత్రయ పడుతున్నది. అత్తగారు నాకా సమయంలో కన్నతల్లిలా అనిపించింది.

అయినా ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఊహించిన దానికంటే ఎక్కువ ఇబ్బందులు ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి.

కానీ వెనుకంజ మాత్రం వేయదలచుకోలేదు.

రెడ్డెమ్మ ఆలోచనలు ఇలా కొనసాగుతుండగా బస్సు పీలేరు, రొంపిచెర్లలను దాటుకొని చిన్నగొట్టిగల్లు చేరింది.

బస్సు ఆపి దిగి వెళ్ళి టీ తాగి వచ్చాడు డ్రైవర్ రాజన్న.

రెడ్డెమ్మను టీ తాగడానికి మాట వరుసకైనా పిలవలేదు రాజన్న.

పెదవులతోనే వ్యంగ్యంగా నవ్వుతూ చూసి బస్ స్టార్ట్ చేస్తున్న రాజన్నను కినుకగా చూస్తూ టికెట్లు పంచింగ్ చేయడానికి సీట్లోంచి నిటారుగా లేచిన రెడ్డెమ్మ తలకు లగేజి క్యారేజి గుద్దుకుంది. వెంటనే తల పట్టుకొని చిన్నగా బాధతో మూలుగుతూ సీట్లోనే చతికిలబడిపోయింది.

"అయ్యయ్యో! దెబ్బ గట్టిగా తగిలిందా అండీ!" సానుభూతి ఒలకబోస్తూ ఇందాకే ఖాళీ అయిన రెడ్డెమ్మ పక్క సీట్లో కూర్చుని మీదికి ఒరిగాడు అంతవరకూ ఆ సీట్లో కూర్చుందామా వద్దా! అని తటపటాయిస్తూ పక్కనే రాడ్ పట్టుకొని నిలుచున్న గళ్ళషర్టు యువకుడు.

రోడ్డు మీద దృష్టిపెట్టి డ్రైవ్ చేస్తున్నా రాజన్నకు జరుగుతున్నదేమిటో స్పష్టంగా వినపడటం లేదు. కానీ కళ్ళు అటు తిప్పి ఒకమారు చూసి జరుగుతున్నదేమిటో అర్థం చేసుకున్నాడు.

ఆ వెంటనే పళ్ళు పటా పటా కొరికాడు ఎందుకో!?

"నాకేమీ జరగలేదు. మీరు కాస్త దూరంగా జరిగి కూర్చోండి" అతని వికృత చేష్టలను నెమ్మదిగా వారిస్తూ, లేచి వెళ్ళి టిక్కెట్లు పంచింగ్ ప్రారంభించింది రెడ్డెమ్మ.

టిక్కెట్లు ప్రయాణీకులకు అందిస్తున్నప్పుడు వాళ్ళలో పుట్టుకొచ్చే వెకిలి ఆలోచనలకు కొంతైనా అడ్డుకట్ట వేస్తుందనే ఉద్దేశంతో, షర్టు వెనుక వేలాడుతున్న మంగళసూత్రాన్ని బయటికి కనిపించే విధంగా సర్దుకొంది రెడ్డెమ్మ.

అయినా మగవాళ్ళు వెర్రి వ్యామోహంతో తననే గుడ్లప్పగించి చూడటం మానలేదు.

అక్కడ –

తన పక్క సీట్లోంచి కదలకుండా తనవేపు తల తిప్పి, తన రాక కోసం ఎదురు చూస్తూ గళ్ళషర్టు యువకుడు.

బస్సు భాకరాపేట ఘాట్ రోడ్‌లో ప్రవేశించింది.

ఇక ఇద్దరు ప్రయాణీకులకు టిక్కెట్లు ఇచ్చేస్తే ఈ ట్రిప్ డ్యూటీ దాదాపు అయిపోయినట్లే. ఎలాగోలాగా ఆ గళ్ళ షర్టు వాడిని సీట్లోంచి లేచేట్లు చేయగలిగితే తను హాయిగా తిరుపతి వరకూ నిద్రపోవచ్చు అనుకుంది రెడ్డెమ్మ.

టిక్కెట్ల పని ముగించుకొని వచ్చి సీట్లో కూర్చుంటూ "వెనుక సీటు ఖాళీగా ఉంది అక్కడికి వెళ్ళి కూర్చోండి" అంది రెడ్డెమ్మ.

"అమ్మ బాబోయ్ ఆ వెనుక కుదుపులకు తట్టుకోగలమా అండీ!" అన్న ఆ యువకుడితో ఏం మాట్లాడాలో తోచక రెడ్డెమ్మ మౌనంగా ఎస్.ఆర్. రాసుకోసాగింది.

ఈ లోపు గళ్ళ షర్టు వాడు కాళ్ళతో రెడ్డెమ్మ కాళ్ళను తాకించి నొక్కాడు.

చటుక్కున కాలు వెనక్కి లాక్కొని ముడుచుకు కూర్చుంది రెడ్డెమ్మ. బాధ్యతల బరువుతో ఆవేశాన్ని అణుకు వగా మార్చుకొని ఎస్.ఆర్. రాయడం పూర్తి చేసింది.

ఇదేమీ తెలియని డ్రైవర్ లైట్లు ఆర్పివేయడంతో యువకుడి వికృత చేష్టలు శృతి మించిపోయాయి ఆ చీకట్లో. వెంటనే రెడ్డెమ్మ కండక్టర్ సీటువద్ద వున్న లైట్ స్విచ్ నొక్కింది.

హఠాత్తుగా మొహం మీద వెలుగు పరుచుకోవడంతో గళ్ళషర్టు పోకిరీ యువకుడి మొహం కందగడ్డలా బిగుసుకుపోయింది. ఇంకాస్త ఆగి వుంటే ఆమె ఆ యువకుడి చెంప పగులగొట్టేదే! కానీ ఇంతలో ఊహించని సంఘటన ఒకటి జరిగిపోయింది.

ఆ దట్టమైన అడవిమార్గంలో రోడ్డుకడ్డంగా ఒక దుప్పి, దానిని వెంటాడుతూ పులి. పరుగెట్టుకొచ్చాయి.

డ్రైవర్ రాజన్న సడన్ బ్రేక్ వేశాడు. ఆ కుదుపుకు బస్సులోని ప్రయాణీకులకు కీళ్ళు కదిలిపోయాయి. గళ్ళషర్టు వాడి తల ఎదురుగా వున్న రాడ్‌కు గుద్దుకొని రక్తం ఏకధాటిగా కారసాగింది. బస్సు హెడ్ లైట్ల వెలుగు నేరుగా కళ్ళలో పడుతుండటంతో ఏటు వెళ్ళాలో దిక్కు తోచక గాండ్రిస్తూ రోడ్డు మీదే కాస్సేపు అటూ ఇటూ తిరిగి తరువాత రోడ్డు దాటి అడవిలోకి కదలి వెళ్ళిపోయింది పులి, దుప్పి జాడలు వెదుక్కుంటూ...

నిద్దర మత్తులోంచి తేరుకున్న ప్రయాణీకులు జరిగిందేమిటో తెలుసుకోవడానికి ఒకరితో ఒకరు సంప్రదించుకోవడంలో మునిగిపోయారు. ఎవ్వరూ ఆ యువకుడి దుస్థితిని గురించి పట్టించుకోలేదు. రెడ్డెమ్మ డ్రైవర్ దగ్గరకు వెళ్ళి ఏదో చెప్పి తనతో పాటు అతనిని తన సీటు వద్దకు తీసుకొచ్చింది. డ్రైవర్ రక్తసిక్తమైన గళ్ళ షర్టు యువకుడి మొహంలోకి కఠినంగా చూస్తూ "ఈ వెధవకు తగిన శాస్తే జరిగిందిలే. బ్రతుకుదెరువు కోసం పదిమందిలోకి వచ్చే స్త్రీల పాలిట కీచకులు వీళ్ళు. వీడు నిన్నింతవరకూ ఎంత ఇబ్బంది పెట్టాడో నువ్వే చెప్పావు ఇందాక. మళ్ళీ నువ్వే వాడికి ఫస్ట్ ఎయిడ్ చేయమని నన్ను తీసు కొచ్చావు. నీ ధోరణి ఏమిటో నాకు బోధపడటం లేదు రెడ్డీ" నొసలు ముడిపెట్టి మరీ అడిగాడు రాజన్న. ఒక రోమియోగా వీడు నన్ను ఇబ్బంది పెట్టినా, మనం మనుషులుగా, బాధ్యతగల ప్రభుత్వోద్యోగులుగా వీడికి ప్రాథమిక చికిత్స చేద్దాం" అంటూ ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుకుంది. అందులోంచి దూది తీసి ఆ యువకుడి మొహం మీది రక్తాన్ని అద్దసాగింది.

డ్రైవర్ అందించిన నియోస్ప్రిన్ ఆయింట్‌మెంట్ తల మీద గాయానికి రాసింది. తన మొహమ్మీద ప్రాకుతున్న రెడ్డెమ్మ చేతులు మాతృత్వపు స్పర్శను గుర్తుకు తెప్పి స్తున్నాయి ఆ యువకుడికి.

క్షమించమనో లేక కృతజ్ఞత తెలియచేయ దానికనో ఆ యువకుడు రెండు చేతులూ జోడించి రెడ్డెమ్మకు నమస్కరించాడు.

కానీ ఆమె కళ్ళలోకి మాత్రం నేరుగా చూడలేకపోయాడు.

హఠాత్తుగా సీట్లోంచి లేచి రక్తం ముద్దగా పడివున్న దానిలో దూది వేలితో అద్ది బస్సు ఎంట్రన్స్ రేకు మీద "స్త్రీలను గౌరవించండి. మహిళా ఉద్యోగినులకు సహకరించండి" అని రాసి వెనుక సీటు వైపుకు నెమ్మదిగా కదిలి వెళ్ళాడు. అలా కదిలి వెళుతున్న అతని చేతిని పట్టుకొని తీసుకొచ్చి తన పక్క సీట్లో కూర్చోబెట్టింది రెడ్డెమ్మ. అతనివేపు అనునయంగా చూస్తూ. స్టీరింగ్ ముందు కూర్చున్న డ్రైవర్ రాజన్న మనసులో ఎందుకో రెడ్డెమ్మ పట్ల ఆరాధనా భావన కలిగింది.

తనిన్నాళ్లూ మగ తోడు లేని స్త్రీని సమాజం చూసే కోణం నుంచే రెడ్డెమ్మను చులకనగా చూశాడు. గతంలో తన శరీర వాంఛను తీర్చుకోవడానికి ఆమెను లొంగదీసుకోవాలని ఒకటి రెండుసార్లు ప్రయత్నించాడు. కానీ, రెడ్డెమ్మ లొంగలేదు. అందుకే, బస్సులో రెడ్డెమ్మను కొందరు మగవాళ్ళు వేధిస్తున్నారనే విషయం తెలిసినా, తనకు లొంగలేదనే అక్కసుతో చూసీ చూడనట్లు నటించాడు. కానీ రెడ్డెమ్మ ఒంటరిగానే తన ఆత్మస్థైర్యంతో ప్రయాణీకులకు కనువిప్పు కలిగించింది.

'ఇందాక రెడ్డెమ్మను వేధించిన పోకిరీ యువకుడు తనకు కీచకుడులాగా అనిపించినట్లే నా ప్రవర్తనా ఆ నాడు రెడ్డెమ్మకు అటువంటి పాత్రనే గుర్తుకు తెప్పించి వుంటుందేమో!' అని పశ్చాత్తాపంతో అనుకుంటూ...

బస్సును స్టార్ట్ చేసి "బ్లైండ్ కర్వ్‌లో మలుపు" తిప్పాడు రాజన్న. ✱



### కరీనా ప్రియుడి గోల!

కరీనాకపూర్, షహీద్ కపూర్ ప్రేమ సంగతేమో కానీ, వినేవాళ్ళకి చెవులు మాత్రం నొప్పులు పుట్టేస్తున్నాయట. కరీనా నోటి వెంట వారి ప్రేమ గాథలు విని. ఈ బాధ ఎలా తప్పించుకోవాలా? అని బాదుకుంటుండగానే కరీనాకపూర్ తమ మరో ప్రేమ విషయం చెప్పింది.

"షహీద్ నన్ను ఆనందంలో ముంచి తేలుస్తున్నాడు. నేను కాలేజ్ లైఫ్ అంటే ఏమిటో ఎరుగను. కానీ షహీద్ మాత్రం ఆ లైఫ్‌ని రియల్‌గా చూపిస్తున్నాడు. ఇప్పుడు నేను కాలేజ్ లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నాను. నిజంగా షహీద్ రుణం ఎలా తీర్చుకోవాలో?"